# ఉద్దాలకమహర్షి

ప్రొఫెసర్ కె. ప్రతాప్

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 10

# ఉద్దాలకమహర్షి

రచన

ప్రొఫెసర్ కె. ప్రతాప్

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 10

UDDALAKAMAHARSHI

by

***Professor K. Pratap***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

Printed at
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens
Tirupati ✆ : 30184

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -


**ఈ వేద కథా భారతి.**

వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ



# మనవి

వేద కథాభారతి.


అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య



# ఉద్దాలక మహర్షి

గురుత్వం గురుతర బాధ్యత :

పరమపవిత్రమైన జ్ఞాననిధులు వేదాలు. తపస్సాధనలో మూలపదార్థ అన్వేషణకోసం నిరంతరం పరితపించిన మహర్షుల ద్వారా భగవంతుడు మానవాళికందించిన నిత్యసత్యాలవి. క్షణికమైన మానవజీవనానికి శాశ్వతత్వాన్ని ప్రసాదించిన సాధనమార్గాలు వేదాలు. ఆద్యంతరహితమైన బ్రహ్మపదార్థంనుండి వెలువడిన ఋగ్యజుస్సామాధర్వణమన్న వేదవిజ్ఞానం సామాన్యమానవుని చేరుకునే ప్రయత్నంలో అనేక రూపాలను సంతరించుకొని ఒక్కోకాలంలో ఒక్కోపేరుతో పిలవబడింది. సృష్టికి కారణము, అద్వితీయము అయిన ఆపరమాత్మ స్వరూపస్వభావాలని స్తుతించినపుడు సంహితలని, అతనిని అర్చించేవిధానాలను తెలిపినపుడు బ్రాహ్మణాలని, అతనిని ఆత్మరూపంలో అన్వేషించే ప్రయత్నాలను ఆరణ్యకాలని వ్యవహరించారు. శీలసంస్కారసంపన్నుడయిన శిష్యుడు అచంచలమైన భక్తి శ్రద్ధలతో గురువును సేవించి అతని అనుగ్రహఫలంగా పొందే జ్ఞానదీపికలు ఉపనిషత్తులు. ప్రపంచము, పరమాత్మ, జీవాత్మ అన్న మూడు అంశాలచుట్టూ పరిభ్రమించే ఈ ఉపనిషత్సాహిత్యం పరమపురుషార్థసాధనకు ప్రాచీనులు వేసిన ఏకైక రాజమార్గం. ఈ జ్ఞానసంపదని తరువాత తరాలవారికి అందించడంకోసం ఏర్పరచుకున్న సాంకేతికోపకరణం గురుపరంపరవ్యవస్థ. స్వాధ్యాయాధ్యయనం శిష్యధర్మం. అధ్యాపనం గురుధర్మం. స్నాతకుడైన శిష్యుడు గురుత్వాన్ని

పొంది గురుధర్మ నిర్వహణ చేయడం ఈవ్యవస్థకి నిత్యనూతనత్వాన్ని ప్రసాదించింది. ఉపనిషత్సాహిత్యంలో గురుత్వాన్ని పరమపవిత్రమైన బాధ్యతగా స్వీకరించి చరితార్థులైన అనేకమంది గురువులలో ఉద్దాలకుడు ఒకడు.

**గురుశుశ్రూష ద్వారానే పొందాలి :**

ప్రాచీన భారతదేశంలో కురుపాంచాలమనేదొక రాజ్యం. సిరిసంపదలకు, వివిధకళలకు నిలయమైన ఆ దేశం వేదవిద్యకు పెట్టినది పేరు. వర్ణాశ్రమధర్మాలననుసరించి అధ్యయన అధ్యాపనాలన విచ్ఛిన్నంగా సాగించే గురుకులాలు ఎక్కడజూచినా కనిపించేవి. నిత్యాగ్నిహోత్రులు, నిష్ఠాగరిష్ఠులు, ఆత్మసాక్షాత్కారసంపన్నులు అయిన కులపతులు గురుకులాలను నిర్వహించేవారు. అటువంటి కులపతులలో సకలశాస్త్ర పారంగతుడయినవాడు అరుణుడు. ఆధ్యాత్మవిద్యావరిష్ఠుడై అతడు మహర్షిగా కూడా పిలవబడినాడు. అతని కుమారుడే ఉద్దాలకుడు.

అరుణేయుడైన ఉద్దాలకుడు ఉపనయనానంతరం సమిత్పాణియై తన తండ్రివద్దనే వేదాధ్యయనం ఆరంభించాడు. కుశాగ్రబుద్ధి గనుక అనతికాలంలోనే అధ్యయనాన్ని ముగించాడు. గురుశుశ్రూషద్వారా పొందే విద్య అత్యంత శ్రేష్ఠమైనదని విశ్వసించిన అరుణుడు తన కుమారుని మద్రనగరంలో సుప్రసిద్ధుడైన పాతంజల కాప్యుని గురుకులానికి వెళ్ళి శాస్త్రాధ్యయనం చేయమని పురమాయించాడు. తండ్రి ఆదేశానుసారం ఉద్దాలకుడు మద్రనగరంలో పాతంజల కాప్యునికి అంతేవాసి అయినాడు. వినయవిధేయతలతోఅకుంఠిత దీక్షతో గురువును మెప్పించి శాస్త్రాలని కరతలామలకం చేసుకున్నాడు. వశిష్ఠచైకతానేయ, దివోదాస భైమసేనుడు ఇతని సమకాలీనులు, సతీర్థ్యులు.

శాస్త్రార్థవిచారంకోసం, అధ్యాత్మవిషయాలకు సంబంధించిన సంశయాలను నివృత్తిచేసుకోవడంకోసం అనేకమంది మేధావులు, మహాత్ములు పాతంజల కాప్యుని గురుకులానికి వచ్చేవారు. వారితోటి పరిచయం, అక్కడ జరిగే సంఘటనలు ఛాత్రులనెంతగానో ప్రభావితులను చేసేవి. ఒకసారి పాతంజల కాప్యుని భార్యను ఒక గంధర్వుడు ఆవహించాడు.

*'ఎవరు నీవు ?' అని అడిగితే తనను తాను కబంధ ఆథర్వణ' డని ' ఆధ్యాత్మ విషయవిచారం' కోసం వచ్చానని ఇలా అడిగాడు. '' ఓ పాతంజల కాప్యా! ఇహలోకము పరలోకము అందలి సర్వభూతాలు ఏ సూత్రంతో బంధించబడియున్నాయో నీకు తెలుసా''? 'అయ్యా! ఆమూలసూత్రంగురించి నాకేమీ తెలియద' ని కాప్యుడు సమాధానమిచ్చాడు. గంధర్వుడు మరోప్రశ్న వేశాడు- 'పోనీ ఈ లోకానికీ పరలోకానికీ సర్వభూతజాలానికీ అంతర్యామిగావుండే తత్త్వమేమిటో నీకు తెలుసా?' అని. దానికి కూడా కాప్యుడు, 'అయ్యా! సర్వవ్యాపియైన ఆ తత్త్వమేమిటో కూడా నాకు తెలియదు. అటువంటి దొకటుందని మీవల్లనే తెలిసింది. దయతో దానిని గురించి తెలియజేసి నన్ను కృతార్థుని చేయండి' అని ప్రార్థించాడు. దానికా గంధర్వుడిలా అన్నాడు- '' ఓ కాప్యా! ఇహపరలోకాలను, సర్వభూతసమూహాన్ని బంధించే సూత్రాన్ని, సర్వేసర్వత్రా ప్రత్యక్షమైయుండే అంతర్యామితత్త్వాన్ని గురించి తెలుసుకున్నవాడు సాక్షాత్తూ పరబ్రహ్మతత్త్వాన్నే తెలుసుకున్నవాడౌతాడు. ఆవిధంగా పరబ్రహ్మతత్త్వవిజ్ఞాన ఘనుడైనవానికి సర్వలోకవిజ్ఞానం కలుగుతుంది.*

> సర్వదేవతావిజ్ఞానం సిద్ధిస్తుంది. వేదవిత్ అవుతాడు. ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. దాంతో సర్వజ్ఞుడౌతాడు''

అని ఆ జ్ఞాన వైభవాన్ని తెలియజేసాడు. ఈ సంఘటనని ప్రత్యక్షంగా చూసిన ఉద్దాలకునికి జీవసృష్టికి ఆధారమైన మూలసూత్రమయిన అంతర్యామితత్త్వము యొక్క జ్ఞానం మాత్రమే కలిగింది గాని వాటి స్వరూప స్వభావాలు తెలియలేదు. తెలుసుకోవాలనే జిజ్ఞాసమాత్రం అతని మనసులో స్థిరంగా నిలిచిపోయింది.

**ఆవులను తోలుకొని వెళ్ళచ్చు !**

విదేహదేశాన్ని పాలించే జనకమహారాజు ఒక గొప్ప యజ్ఞం చేశాడు. వచ్చినవారికందరికీ పెద్దఎత్తున దానధర్మాలు చేశాడు. యజ్ఞంలో పాల్గొనడానికి విచ్చేసిన విద్వద్వరేణ్యులకి పండిత ప్రకాండులకి ఒక సభను ఏర్పాటు చేశాడు. అందులో ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన చర్చలకు అవకాశం కలుగజేసాడు. బలిష్ఠములైన వేయి పాడిఆవులని తెప్పించి, వాటి కొమ్ములను బంగారు నాణాలతో అలంకరించి బ్రహ్మజ్ఞాని అయినవాడు సభాసదులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి ఆ ఆవులను తోలుకొని వెళ్ళవచ్చని సభాముఖంగా ప్రకటించాడు. ఎంతో విలువైన పారితోషికం. అందరికీ అందుకోవాలని వుంది. అయితే తగిన అర్హత తమకుందా అని బేరీజు వేసుకోసాగారు. శాస్త్రజ్ఞానసంపన్నులయిన అశ్వలుడు, ఆర్తభాగుడు, గార్గి, శాకల్యుడులాంటి వారెంతోమంది అక్కడవున్నా, ముందుకు రావడానికి సాహసించలేకపోతున్నారు. అయితే యాజ్ఞవల్క్య మహర్షి మాత్రం అందుకు సిద్ధపడ్డాడు. సభలోని పండితులు చకితులైనారు. పారితోషికం చేజారిపోతున్నది. దానిని తమవశం చేసుకోవాలంటే యాజ్ఞవల్క్యమహర్షిని ఎదిరించి, వాదించి,

జయించాలి. అది వారికి సాధ్యమనిపించలేదు. జనకుని ప్రధానపురోహితుడైన ఆశ్వలుడు ముందుకు వచ్చి -

''యాజ్ఞవల్క్య! జిజ్ఞాసువులలో నేనే ప్రథముడనని ఊహించుకుంటున్నావు. అసలునీకు బ్రహ్మతత్త్వం గురించి తెలుసా?''-

అని అడిగాడు. దానికి యాజ్ఞవల్క్యుడు

''బ్రహ్మజ్ఞానం నాకు తెలియదు. అయినా బ్రహ్మజ్ఞానానికి వినయంగా వంగి నమస్కరిస్తాను. నేను బీద బ్రాహ్మణుణ్ణి. ఈ ఆవుల అవసరం నాకెంతోవుంది. బ్రహ్మజ్ఞానానికి సంబంధించిన సందేహాలెవరికైనావుంటే నా శక్తిమేరకు వాటిని తీర్చడానికి ప్రయత్నిస్తాను''

అని అంటూ బ్రహ్మజ్ఞానం బుద్ధికి అందేదికాదని నర్మగర్భంగా సమాధానంలో సూచించాడు.

**ఆత్మ అంటే ఏమిటి ?**

ఆశ్వలుడు యజ్ఞాలను గురించి, వాటి అధిష్ఠాన దేవతల గురించి యజ్ఞఫలాలను గురించి, మంత్రాలను గురించి అనేక ప్రశ్నలు వేశాడు. వాటన్నిటికీ తడుముకోకుండా యాజ్ఞవల్క్యుడు సమాధానాలనివ్వడంతో ఆశ్వలునికి మౌనంగా కూర్చోవడం తప్ప మరోమార్గం లేకపోయింది.

మరోపండితుడు

**'ఆత్మఅంటే ఏమిటో తెలియజేయండి'**

గృహస్థాశ్రమంలోకి . . . .

ఉద్దాలకుని అజ్ఞానపు పొరలు తొలగినాయి. జ్ఞాననేత్రం ప్రకాశించింది. ఆనందం నిండిన అశ్రునయనాలతో కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించి తన స్థానంలో కూర్చొన్నాడు అప్రతిహతమైన యాజ్ఞవల్క్యుని బ్రహ్మజ్ఞానానికి జేజేలు పలికి సభాసదులతో కలిసి జనకుడు అతనిని గోసంపదతో సాగనంపాడు.

పితృపాదులయిన అరుణుని సాన్నిధ్యంలో ఆరంభమయిన విద్యాభ్యాసంగం పాతంజలికాప్యుని పర్యవేక్షణలో పరిణతిని చెంది, శాస్త్రకోవిదులు, తపస్సంపన్నులు అయిన మహాత్ముల సాహచర్యంలోని అనుభవంతో పరిపూర్ణతని సాధించింది. బ్రహ్మచర్యానికి స్వస్తిపలికి గృహస్థాశ్రమంలోకి ప్రవేశించాడు ఉద్దాలకుడు. విధ్యుక్తధర్మంగా గురుకులాన్ని నిర్మించుకొని ఛాత్రసంతతికి విద్యాదానం చేయడమారంభించాడు. ఆచార్యశ్రేష్ఠునకు ఆరోజుల్లో ప్రదానం చేస్తున్న గౌతముడన్న బిరుదును పొంది, లబ్ధప్రతిష్ఠుడై, దేశదేశాల నుండి విద్యార్థులనాకర్షించసాగాడు. కౌశాంబికి చెందిన ప్రోతి కౌసూరిబింది, వాజసనేయాదులు ఇతని శిష్యవర్గములోని వారే, తన సమకాలీనులైన ప్రాచీన యోగ్యసంచేయ, భద్రసేన అజాత శత్రువులను తన వాక్చాతుర్యంతో వాదనలో పరాజితుల చేసినవాడు ఆరుణేయుడు.

వైశ్వానర విద్యను తెలుసుకోవాలి :

ఒకనాటి ప్రాతఃకాలములో గురుకుల పర్యవేక్షణలోనున్న ఉద్దాలకునకు సందర్శకులెవరో వచ్చినట్టు వర్తమానం అందింది. ఆతురతతో ఆహ్వానించడానికి వెళ్లిన ఆరుణి వచ్చినవారిని చూసి

ఆశ్చర్యపోయాడు. వారెవరో కాదు. తనలాగే గురుకులాలను నడిపే కులపతులువారు. ఉపమన్యుని కుమారుడు ప్రాచీనశాలుడు, పులుషపుత్రుడు సత్యయజ్ఞుడు, భల్లవనందనుడు ఇంద్రద్యుమ్నుడు, శర్కరాక్షుని సుతుడు జనుడు, అశ్వతరాశ్వుని కుమారుడు బుడిలుడు. వీరందరూ వేదవేదాంగపారంగతులు, సంపన్నగృహస్థులు, గోస్వాములును. వారికి తగిన అతిథిసత్కారాలను చేసి, వారిరాకకు గల కారణమడిగాడు. వయోవృద్ధుడైన ప్రాచీనశాలుడు-

*'కులపతీ! మన అందర్లో అంతర్లీనంగా వుండే ఆత్మస్వరూపాన్ని, జగత్తును వ్యాపించిన బ్రహ్మతత్త్వాన్ని తెలియజేసే వైశ్వానరవిద్యని తెలుసుకోవాలని, అందుకు తగిన సమర్థులు మీరేనని నిర్ణయించుకొని వచ్చాము. మాయందు దయయుంచి ఆవిద్యను ఉపదేశించవలసినదిగా కోరుతున్నాము'*

అని తెలిపాడు. ఉద్దాలకుడు మనసులో వచ్చిన జిజ్ఞాసువులు సామాన్యులు కారు. వైశ్వానరవిద్య తనకూ సమగ్రంగా తెలియదు. గనుక ఆ విద్యను బోధించగల గురువును చూపించి వారితోపాటు తానుకూడా వెళ్ళి ఆ విద్యను సమగ్రంగా గ్రహించాలని నిర్ణయించుకొని వారితో ఇలా అన్నాడు-

*'మహనీయులారా! మీరు ఒకరికన్నా వేరొకరు ఘనులు. మీకు బోధించగలిగినవాడను కాను. ఆత్మరూపుడైన వైశ్వానరుని విషయంలో విశేషంగా కృషి చేసిన కేకయ దేశాధినేత అశ్వపతి మహారాజు మనకావిద్యనుపదేశించడానికి సమర్థుడు. అతనిని ఆశ్రయించి మన తృష్ణను తీర్చుకుందాం'.*

నిర్మలములైన ఉద్దాలకుని మాటలకు సంతసించి అతనితోపాటు వెంటనే

కేకయరాజ్యం చేరుకొని రాజసభలో ప్రవేశించారు కులపతులందరూ.

**మీకు ఉపదేశించగల సామర్థ్యం లేదు :**

కులపతుల సమూహాన్ని చూసిన అశ్వపతి సవినయంగా ఆహ్వానం పలికి అతిథిమర్యాదల తరువాత గురుకుల నిర్వహణకై అవసరమైన వనరులకోసం వచ్చివుంటారన్న భావనతో ధనరాసుల్ని వారిముందుంచి కానుకలుగా స్వీకరించమని అభ్యర్థించాడు. ఉద్దాలకుడు లేచినిలబడి, ''మహారాజా! మీ దయవలన మా గురుకులాలు క్షేమంగా సుభిక్షంగా, నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. మేము ధనార్తులమై రాలేదు. జ్ఞానార్థులమై వచ్చాము. మీరత్యంత శ్రద్ధాభక్తులతో ఆరాధించే వైశ్వానరవిద్యను గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో వచ్చాము. జ్ఞానదానం చేయండి' అని ముకుళితహస్తాలతో అర్థించాడు. కులగురువుల జ్ఞానపిపాసకు ప్రసన్నుడైన అశ్వపతి- 'మీకుపదేశించగల సామర్థ్యం నాకుందని అనుకోవడం లేదు. అయినా నాబుద్ధికుశలతకు మీరు పెట్టిన పరీక్షగా భావించి నాకు తెలిసిన కొలది తెలపడానికి ప్రయత్నిస్తాను. ప్రస్తుతానికి విశ్రాంతిని తీసుకోండి' అంటూ ఆనాటి కొలువును ముగించాడు.

మరునాటి ప్రభాతసమయంలో సమిత్పాణులై వినయవిధేయతలతో మహారాజును సమీపించారు గురువులు. వారిని ఉచితాసనాలపై కూర్చుండజేసి, 'మహాత్ములారా! వైశ్వానరవిద్యను బోధించడానికి ముందు మీరు ఆత్మస్వరూపాన్ని ఏ రూపంలో భావించి ఆరాధిస్తూవున్నారో తెలియజేస్తే దానిని బట్టి వైశ్వానరవిద్యను బోధించగలను. గనుక మీరు ఒక్కొక్కరూ మీ ఉపాసనారీతులని తెలపండి' అని అన్నాడు.

అందరిలోకీ పెద్దవాడయిన ప్రాచీనశాలుడు ద్యులోకమును ఆత్మస్వరూపముగాను, సత్యయజ్ఞుడు ఆదిత్యుని రూపములోను ఇంద్రద్యుమ్నుడు వాయురూపములోను, జనుడు ఆకాశరూపములోను, బుడిలుడు జలరూపంలోను, ఉద్దాలకుడు పృథ్వీ రూపములోను ఆత్మస్వరూపాన్ని ఉపాసిస్తూ వున్నట్టు తెలిపారు. వారికి అశ్వపతి ఇలా బోధించసాగాడు-

## అదే వైశ్వానర విద్య :

''మహానుభావులారా! వైశ్వానరాత్మ అనేక అంశాలతో కూడుకొన్నది. వాటిలోని ఒక్కొక్క అంశాన్ని గ్రహించి మీరు ఉపాసిస్తూవున్నారు. సమగ్రంగా భావించడం లేదు. వైశ్వానరాత్మకు ద్యులోకము శిరస్సు, సూర్యుడు నేత్రములు, ఆకాశము మొండెము, జలము నిమ్నభాగము, పృథివి చరణములు. యజ్ఞవేదిక విరాట్పురుషుని వక్షస్థలము, కుశలు అతని రోమావళి, గార్హపత్యాగ్ని హృదయము, జఠరాగ్ని మనస్సు, ఆహవనీయాగ్ని అతని ముఖము. ఈ ఆహవనీయాగ్నిలో ఆహుతులనువేసి ఆయా ఇంద్రియములను సంతృప్తిపరచవలెను. ఇట్లు విషయతత్త్వమును తెలిసి యాగముచేయు యజమానియొక్క సమస్త కాయిక, వాచిక, మానసిక పాపములు నాశనమగును. ఇలా వైశ్వానరునర్చించినవానికి ఆత్మసాక్షాత్కారము కలిగి జగత్తు అంతా బ్రహ్మమయంగా భాసిస్తుంది. అదే 'సర్వం ఖల్విదం బ్రహ్మ' భావన'' - అని తెలిపాడు. ఆచార్యులముఖాలు వికసించాయి. ఆనందాతిశయంతో అశ్వపతిమహరాజుకు కృతజ్ఞతలు తెలిపి వారివారి ఆశ్రమాలకు బయలు దేరారు కులపతులు.

మతేం చదువుకున్నావు ?

కాలక్రమంలో గృహస్థాశ్రమాన్ని స్వీకరించిన ఉద్దాలకుడు గురుకుల నిర్వహణలో ఎప్పుడూ తలమునకలైయుండేవాడు. కొంతకాలానికి ఆదంపతులకు పుత్రోదయమయింది. అతనికి శ్వేతకేతువని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. విద్యాసముపార్జనలో కన్నా ఆటపాటల మీద అతనికి అభిరుచి ఎక్కువగా వుండేది. గురుకులబాధ్యతల నడుమ కుమారునిపట్ల తగిన శ్రద్ధను చూపలేకపోయాడు ఉద్దాలకుడు. గురుపుత్రునిగా గౌరవాస్పదస్థానంలో పెరిగి నందున అతనిలో అహంకారం పెరిగి పెరిగి స్వభావంగా మారింది. అడపా దడపా తండ్రివద్ద నేర్చిన విద్యని సమగ్రమయినదానిగా అపోహపడ్డాడు. పాంచాలదేశాన్ని పాలించే ప్రవాహణ జైపాలి యజ్ఞం చేస్తూ, అందులో భాగంగా ఆధ్యాత్మికజ్ఞాన సదస్సు నేర్పాటుచేసి దేశవిదేశాలలోని విద్యావేత్తలని ఆహ్వానించాడు. ఆసమయంలో ఉద్దాలకుడు ఆశ్రమంలోలేడు. తండ్రి తరపున శ్వేతకేతువు ఆసదస్సులో పాల్గొన్నాడు. ప్రవాహణుడు ఇతనిని చూసి-

'కుమారా! నీవెక్కడ చదువుకున్నావు'

అని అడిగాడు. తండ్రిగారైన ఉద్దాలకునివద్దనే విద్యావ్యాసంగం పూర్తి చేసినట్లు హుందాగా సమాధానమిచ్చాడు శ్వేతకేతువు. ప్రవాహణుని పరీక్ష ఆరంభమయింది.

'బ్రాహ్మణకుమారా! మనుష్యులు మరణించిన తరువాత ఎక్కడికి వెళతారో తెలుసా నీకు?'' అని అడిగాడు. శ్వేతకేతువు 'తెలియదు' అని సమాధానమిచ్చాడు. 'పోనీ మరణించినవారు ఈలోకానికి మళ్లీ ఎలా తిరిగి వస్తారో తెలుసా?' అని రెండప్రశ్న. 'లేదండి, తెలియదు' అదే సమాధానం. 'మృతి చెందినవారు ప్రయాణంచేసే

దేవయానం పితృయానం అని రెండు మార్గాలున్నాయి. వాటిని గురించి ఎపుడైనా విన్నావా'- ప్రశ్న. 'లేద'ని సమాధానం. ''ఎన్ని ప్రశ్నలడిగినా తెలియదనే చెబుతున్నావు. అటువంటప్పుడు విద్యాభ్యాసం పూర్తయిందని చెప్పడం సాహసంతో కూడిన పని. నీకసలు జీవితంలోని ప్రధానసమస్యల గురించిన జ్ఞానమే శూన్యం'' అని మందలించాడు ప్రవాహణుడు. అవమానంతో తలవంచుకున్నాడు శ్వేతకేతువు. సరాసరి తండ్రిదగ్గరికి వెళ్ళి పాంచాలరాజసభలో తనకు జరిగిన పరాభవాన్ని గురించి, ప్రవాహణుని ప్రశ్నపరంపరల గురించి వివరంగా చెప్పి, ఇవేవీ బోధించకుండా విద్యావ్యాసంగం ఎలా పూర్తి చేశానో అర్థం కావటం లేదని బాధపడ్డాడు.

**ఇద్దఱం కలసి తెలుసుకుందాం !**

తన కన్నా ఇతరుల ద్వారా బోధింపజేయడం ఉత్తమమన్న భావనతోనూ, రాజర్షి ప్రవాహణుని ముఖతః వినాలన్న కుతూహలంతోను ఉద్దాలకుడు 'నాయనా! శ్వేతకేతూ ప్రవాహణుని ప్రశ్నలకు నాకూ సమాధానం తెలియదు. తెలిసివుంటే ఎందుకు చెప్పను. దాచవలసిన అవసరం లేదు. మనమిద్దరమూ కలసి ప్రవాహణుని దగ్గరకువెళ్ళి సమాధానాలు తెలుసుకుందాం. పద' అని కుమారుని వెంటబెట్టుకొని పాంచాలానికి బయలుదేరాడు. రాజు తన ఆస్థానంలోకి ప్రవేశించిన తండ్రీకొడుకులని చూసి సగౌరవంగా ఆహ్వానించి ఎంతధనం కావాలో తెలపమన్నాడు. దానికి ఉద్దాలకుడు ''మహారాజా! మాకవసరమయింది ధనం కాదు. మీదగ్గరున్న జ్ఞానధనాన్ని మాకు దానం చేయండి. నాకుమారుని మీరడిగిన ప్రశ్నలకు వాటి సమాధానాన్ని తెలపడం ద్వారా మా అజ్ఞానాన్ని తొలగించండి అది చాలు?'' అని ప్రార్థించాడు. వారి జిజ్ఞాసకు ఆశ్చర్యపోయిన ప్రవాహణుడు

'బ్రాహ్మణోత్తములారా! ఇంతవరకు ఈ జ్ఞానం సాంప్రదాయకంగా క్షత్రియులకే పరిమితమైయున్నది. మొట్టమొదటి సారి నేను బ్రాహ్మణులైన మీకు బోధిస్తున్నాను'. అని బోధించడం ప్రారంభించాడు.

'ప్రపంచంలో ప్రతి జీవి అగ్నిలో పుట్టి అగ్నిలో కలసిపోతాడు. మాతృగర్భం మొదటి అగ్నికుండం. శ్మశానచితి చివరి అగ్ని. శ్రద్ధాభక్తి సంపన్నులు తపశ్శక్తితో దేవయానంలో బ్రహ్మలోకానికి వెళతారు. సామాన్యులు ధూమయానంలో పితృలోకాలకి వెళతారు. జీవన్ముక్తులు పంచతత్వాలలో లీనమై బ్రహ్మనిర్వాణం పొందుతారు. పతితులు జనన మరణ చక్రంలో తిరుగుతూ వుంటారు. అగ్నిని ఆరాధించేవారిని అగ్ని పుణ్యలోకాలకు తీసుకొని వెళుతుంది. పుణ్యలోకాలకు, పితృలోకాలకు వెళ్ళిన వాళ్లు తిరిగి అదేమార్గంలో మర్త్యలోకాన్ని చేరుకుంటారు'-

జీవితం గురించి, దాని ఉత్పత్తి వికాసాల గురించి మొదటిసారి తెలుసుకున్న ఆరుణి శ్వేతకేతువులు ప్రవాహణ జైపాలికి నమస్కరించి ధన్యవాదాలను తెలియజేసి జ్ఞానప్రకాశంతో తమ ఆశ్రమానికి చేరుకున్నారు.

**మంచి గురువును ఆశ్రయించు !**

కుమారుని భవిష్యత్తును గురించిన ఆలోచనలు ఉద్దాలకుని నిద్రపోనీయలేదు. పుత్రవాత్సల్యంతో సరియైన శిక్షణనివ్వలేక పోయినందుకు చింతించాడు. ఇక నిర్లక్ష్యం పనికిరాదని ప్రాతఃకాలంలోనే శ్వేతకేతువుని పిలిచి- 'నాయనా! మనవంశంలో నామమాత్రపు ద్విజులుకాని, వేదాధ్యయనం చేయనివారుకాని ఎవరూ లేరు. వేలాది మందికి జ్ఞానదానం చేస్తున్న మాకు నిన్ను ఇలా చూడటం ఎంత వేదనకు గురిచేస్తుందో ఒకసారి ఆలోచించు. గనుక ఇప్పటికయినా ఆలస్యము

చేయక శ్రేష్ఠుడు నీకు తగినటు వంటి ఆచార్యుని ఆశ్రయించి విద్యను సాధించు, మా వంశగౌరవాన్ని కాపాడు' అని చెప్పాడు. భ్రాంతి తొలగిన శ్వేతకేతువు తన తల్లి దండ్రుల ఆవేదనను అర్థం చేసుకొని పశ్చాత్తాపంతో లక్ష్యాన్ని సాధించాలనే ప్రగాఢమైన సంకల్పంతో మరుసటిరోజే ఉపమన్యుని కుమారుడైన ప్రాచీనశాలుని గురుకులానికి అధ్యయనార్థం బయలుదేరి వెళ్లాడు. పూర్వపరిచితుడైన ప్రాచీనశాలుని నేతృత్వంలో పట్టుదలతో అనేక శాస్త్రాలను అనతికాలంలోనే నేర్చుకున్నాడు. కాని వయోదోషం వలననో, ప్రకృతి వలననో అతని అభిమానతత్త్వం దూరం కాలేదు. పైగా అది ద్విగుణీకృతమయింది.

సమావర్తన సంస్కారాన్ని ముగించుకుని ఇంటికి బయలుదేరిన శ్వేతకేతువును తన ప్రతిభాపాటవాలని ప్రదర్శించి తన తండ్రి కన్నుల్లో మెరిసే కాంతులను చూడాలన్న ఉత్సాహం ఉక్కిరిబిక్కిరి చేసింది. శాస్త్రజ్ఞానం సాధించానన్న అహంకారం, దర్పం,గర్వం అతని కళ్లల్లో ప్రతిఫలించాయి. దానిని గ్రహించిన ఆరుణేయుడు మెల్లగా కుమారుని చేరబిలిచి ఇలా అడిగాడు- 'నాయనా! నీవు విద్యావంతుడవైనావు. చాలా సంతోషం. కాని, దేనిని వింటే వినని విషయాలు వినిపిస్తాయో, దేనిని గ్రహిస్తే గ్రహణయోగ్యం కాని విషయాలు గ్రాహ్యమౌతాయో, దేనిని తెలుసుకుంటే తెలియని విషయాలు తెలుస్తాయో దానిని గురించి తెలుసుకున్నావా? జగత్తులోని సమస్తానికి ఆధారమైన విద్యను నీగురువుల నుండి గ్రహించావా?' అని. శ్వేతకేతువు ఉత్సాహం చల్లబడింది. తన విద్యాభ్యాసంలో అటువంటి విషయాన్ని తెలుసుకునే అవకాశమే రానందుకు సిగ్గుతో తలవంచాడు, తను ఆర్జించిన శాస్త్రజ్ఞానం ఎంత అల్పమయిందో తెలియవచ్చింది. అహంకారపుపొరలు ఒక్కటొక్కటిగా తొలగిపోసాగాయి. తండ్రి పాదాలు మీదపడి క్షమాపణలను కోరుకుని సరియైన జ్ఞానాన్ని ప్రసాదించవలసినదిగా ప్రార్థించాడు.

తత్త్వమసి :

ప్రేమతో కుమారుని లేవదీసి, 'నాయనా చింతించకు. ఇప్పటికయినా నీ నిజమైనస్థితిని తెలుసుకున్నావు. లోకములో అభిమానమెన్నడూ సన్మానపాత్రము కాజాలదు. దురభిమాని కల్యాణపాత్రుడు కాజాలడు. విద్యావంతుడు నిరభిమానిగా వుండవలెను. నీకవసరమైన విద్యను నేనే స్వయంగా తెలుపుతాను. సావధానంగా గ్రహించు!' మని ఇలా ఉపదేశించసాగాడు.

''శ్వేతకేతూ! మట్టిని గురించి తెలుసుకుంటే మట్టితో తయారయిన కుండ, ముంత, బాన వంటి వస్తువులజ్ఞానం వచ్చినట్లే బ్రహ్మతత్త్వాన్ని గురించి తెలుసుకుంటే బ్రహ్మచే నిర్మితమయిన ఈ ప్రపంచంలోని సమస్తవస్తుజ్ఞానం కలుగుతుంది. ప్రపంచోత్పత్తికి ముందు సత్ పదార్థమొక్కటే వుండేది. అది తనకు తానే అనేక రూపాలుగా అభివ్యక్తం కావాలని సంకల్పించుకుంది. వెంటనే అందులోంచి తేజస్సు పుట్టింది. తేజస్సులోంచి నీరు, నీటిలోంచి పృథివి, పృథివిలోంచి అన్నము ఉత్పన్నమయినాయి. పెరుగును చిలకడం ద్వారా సారభూతమయిన వెన్న బయటికి వచ్చినట్లు, మనుష్యుడు భుజించిన ఆహారము సూక్ష్మముగా మనసుగాను, జలముల సూక్ష్మభాగముతో ప్రాణము, ఘృతాది తేజఃపదార్థముల సూక్ష్మభాగముతో వాక్కు ఏర్పడుతున్నాయి. ఇలా సత్పదార్థమే వీటన్నిటికీ మూలకారణము, అధిష్ఠానమైయున్నది. నీలోనూ నాలోనూ కూడా సత్ పదార్థమే ఆత్మ రూపములో నున్నది. ఆ ఆత్మను తెలుసుకుంటే ఇక తెలియవలసినదేదీ వుండదు. అదే నీవైయున్నావు. 'తత్త్వమసి' -

''వివిధపుష్పాలనుండి తేనెటీగెల చేత తీసుకొనిరాబడిన తేనె బిందువులు మధువుగా మారిన తరువాత తాము ఏ పుష్పమునుండి

గ్రహించబడినామో తెలుసుకొనజాలవు. ఇదేరీతిగా సృష్ట్యంతమున సద్వస్తువులో లీనమయిన జీవాత్మలు తమ పూర్వస్థితిని తెలుసుకొనజాలవు. ఆ సద్వస్తువే నీ ఆత్మ. అదియే నీవై వున్నావు. 'తత్త్వమసి' -

''సముద్రమందలి నీరు మేఘములద్వారా వర్షించి, గంగాయమునాది నదులుగా వ్యవహరించబడి, మరల ఆ సముద్రమునందే కలియుచున్నవి. సముద్రమున కలిసిన తరువాత తమ ప్రత్యేకతను గుర్తించలేవు. అదేరీతిగా ఈ జీవజాలమంతయూ సత్పదార్థము నుండి ఉద్భవించి దానియందే లీనమగు చున్నది. కాని తాను సత్పదార్థమునుండి పుట్టినట్టుగాని, లయించినట్టు గాని ఎరుగదు. అదే సత్పదార్థము. అదే నీవై వున్నావు. తత్త్వమసి. -

''జీవాత్మకు మరణం లేదు. ప్రళయకాలమున జీవాత్మ సూక్ష్మతత్త్వముగా ఆ సత్ పదార్థము నందే లీనమైపోవును. ఆ సత్ పదార్థమే నీవు. తత్- త్వం అసి. -

''ఒక మహావృక్షానికి దాని చిన్నవిత్తులో మన కంటికి కనబడని సూక్ష్మ పదార్థమెట్లు కారణమగుచున్నదో, అటులనే సూక్ష్మాతిసూక్ష్మము, ఇంద్రియగోచరముకాని ఆ సత్పదార్థము ఈ విశాలవిశ్వానికి ఆధారమైయున్నది. ఆసత్పదార్థమే నీవు తత్- త్వం- అసి. -

''చక్షురింద్రియము చేత గ్రాహ్యమైన ఉప్పు నీటిలో పడవేసిన తరువాత నీటి యందు అంతటా వ్యాపించి, కంటితో కాక రసనేంద్రియముతో అనుభవింపబడినట్లే, విశాలప్రపంచమంతటా వ్యాపించిన సత్స్వరూపమగు సూక్ష్మాత్మ ఇంద్రియాదులతోగాక, జ్ఞానము చేత అనుభవైకవేద్యమగుచున్నది. సత్స్వరూపమైన సూక్ష్మతయే నీవై

యున్నావు. తత్-త్వం-అసి.

''కన్నులకు గంతలుకట్టి అపరిచితమైన ప్రదేశమునందు వదలబడిన వ్యక్తి, తన గంతలు విప్పుకొని, కనబడిన ప్రతివారిని, తానున్న ప్రదేశాన్ని గురించి, తాను చేరవలసిన గమ్యాన్ని గురించి అడిగి తెలుసుకుంటూ ఏ విధంగా చివరికి తన గమ్యాన్ని చేరుకుంటాడో అదే విధంగా అజ్ఞానాంధకారంలో నున్న జీవాత్మ, కామక్రోధాదులకు చిక్కి-భయంకరమైన సంసారారణ్యమున విడువబడినవాడై, బ్రహ్మజ్ఞాని యగు సద్గురువుల మార్గ నిర్దేశమున సన్మార్గమున నడిచి, మూలస్వరూపమయిన సత్పదార్థమును చేరుకొనుచున్నాడు. ఆ సత్పదార్థమే జగదాత్మ. అదియే నీవై యున్నావు- తత్ -త్వం-అసి-

ఈ విధంగా గ్రహింపజాలని ఆత్మతత్త్వాన్ని అత్యంతసులభంగా శ్వేతకేతువుకు వివరించాడు ఉద్దాలకుడు. ఔద్దాలకుని అజ్ఞానం పటాపంచలయింది. బ్రహ్మతేజస్సు అతని ముఖంలో వెల్లివిరిసింది. ఉద్దాలకుడు ఆనందంతో పొంగిపోయాడు. ఈ జ్ఞానపరంపరన విచ్ఛిన్నంగా ముందుతరాలవారికి అందించగలుగుతున్నందుకు పొంగి పోతూ ఋషిఋణం తీర్చుకొన్నందుకు సంబరపడిపోయాడు. బ్రహ్మవిద్యకు జయమగుగాక! అది శాశ్వతమగుగాక! అని ప్రార్థించాడు. జ్ఞానోదయమయిన శ్వేతకేతువు తండ్రికి తగిన కుమారుడిగా జ్ఞానజ్యోతిని చేతబట్టి కీర్తి పతాకాన్నెగురవేశాడు.

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

CENTENARY CELEBRATIONS OF SRI VENKATESWARA VEDA PATHASALA

DHARMAGIRI

&

VEDA . AGAMA . SILPA SADAS

5-7-1999 To 8-7-1999